సాక్షి నల్లగొండ

బుధవారం। 12। ఫిబ్రవరి। 2025



రూ.65.50లక్షలు స్వాహా

శివన్నగూడ ఎఫ్ఎస్‌సీఎస్ ఉద్యోగులు పాలక వర్గానికి తెలియకుండానే రూ.65.50 లక్షల నిధులు వాడుకున్నారు. - 10లో



వైభవంగా రథోత్సవం

పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి. అమ్మవార్లు దివ్య విమాన రథంపై విహరించారు. - 8లో



ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం

వామపక్షాలను ఏకంచేసి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల సంఖ్య 1911

నల్లగొండ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదాను ప్రకటించారు. ఈ మేరకు జెడ్పీసీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి మంగళవారం జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా వాటి పరిధిలో 352 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ఇప్పటికే ప్రకటించారు. జిల్లాలో మొత్తం 1911 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 400 మంది ఓటర్ల వరకు 145 పోలింగ్ స్టేషన్లు, 401 మంది ఓటర్ల నుంచి 500 మంది ఓటర్ల వరకు 420 పోలింగ్ స్టేషన్లు, 501 నుంచి 750 మంది ఓటర్ల వరకు 1,346 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కాగా.. జిల్లాలో మొత్తం 10,78,335 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు.

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు



సూచనలు చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర

శాలిగౌరారం: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శాలిగౌరారం మండల పరిధిలోని వంగమర్తి గ్రామ సమీపంలోని మూసీ నది ఒడ్డున ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక డంపింగ్ చేసే వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిస్తే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయన వెంట నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు ఉన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



త్రిపురారం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

త్రిపురారం: వైద్యసిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం త్రిపురారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 108 ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పెద్దదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు గ్రామాల్లో అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట డాక్టర్ కేస రవి, మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ ప్రియాంక, పుట్ట గోపాల్ రెడ్డి ఉన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలి



మహ్మదాపురం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నాంపల్లి: ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లి మండలంలోని మహ్మదాపురం గ్రామంలో నర్సరీని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో అనువుగా ఉన్న స్థలాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచాలన్నారు. కూలీలకు పనులు కల్పించకపోతే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహ్మదాపురం గ్రామంలో పనులు జరగట్లేవని, త్వరలోనే పనులు చేయించాలన్నారు. కూలీలకు రోజుకు రూ.300వచ్చే విధంగా కొలతలు వేయాలని సూచించారు. రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ గుంటుక వెంకటేశం, ఈసీ లింగయ్య, టీఏలు అంజయ్య, ఈశ్వరయ్య, భాస్కర్, నాగయ్య, పంచాయితీ కార్యదర్శి అజయ్ తదితరులున్నారు.

•ముత్యాలమ్మ జాతరలో భక్తజన సందోహం



పెద్దవూర మండలంలోని రామన్నగూడెం తండాలో మంగళవారం సుంకిశాల ముత్యాలమ్మ జాతరలో కిక్కిరిసిన భక్తులు - పెద్దవూర

నేడు జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నల్లగొండ జిల్లాకు రానున్నారు. ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 9.30 గంటలకు నార్కట్‌పల్లి మండలం గోపలాయిపల్లి గ్రామంలో గల శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నారు. అదేవిధంగా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

పౌల్ట్రీ ఫాంల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

- ఇప్పటివరకు 70 కోళ్ల ఫారాల పరిశీలన
- పాజిటివ్ కేసులు ఏమీ నమోదు కాలేదంటున్న అధికారులు

నల్లగొండ అగ్రికల్చర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత వారం, పదిరోజులుగా కోళ్లు బర్డ్‌ఫ్లూతో చనిపోతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించింది. ఈమేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పౌల్ట్రీ ఫారాలను సందర్శించేందుకు ప్రత్యేక బృందాలు నియమించింది. ఇప్పటికే బృందంలోని వెటర్నరీ డాక్టర్లతో పాటు పారా వెటర్నరీలు, సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరు బృందాలుగా ఏర్పడి పౌల్ట్రీ ఫారాలను సందర్శిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 70 పౌల్ట్రీ ఫారాలను సందర్శించారు. ఫారం జిల్లా, మండలం, గ్రామం పేరుతో పాటు ఫారం యజమాని పేరు, ఎన్ని కోళ్లు ఉన్నాయి. నాటుకోళ్లు, బ్రాయిలర్ కోళ్లు, చిక్స్ ఇచ్చిన కంపెనీ పేరు, ఫీడ్ సరఫరా చేసే కంపెనీ పేరు, వారి సెల్ నంబర్లు, ఎన్ని కోళ్లు ఉన్నాయి, షెడ్ సామర్థ్యం, ఏమైనా కోళ్లు చనిపోయాయా అనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రాష్ట్ర స్థాయి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చనిపోయిన కోళ్లలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేక ఆర్‌డీ (రానికేట్ డీసీస్) లక్షణాలు ఉన్నట్లు కనిపిస్తే శాంపిల్స్ సేకరించనున్నారు. ఈ శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పరీక్షల నిమిత్తం పంపించనున్నారు.



రాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ) ఏర్పాటు

జిల్లాలో ఎక్కడైనా కోళ్లకు బర్డ్‌ఫ్లూ ప్రబలినట్లు సమాచారం అందినట్లు తెలిస్తే వెంటనే అక్కడికి వెళ్లి చికిత్స అందించడానికి జిల్లా స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ ఏర్పాటు చేసింది. ఈ టీంలో పశు వైద్యుడితో పాటు ఇద్దరు పారా వెటర్నరీలు, ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరు జిల్లావ్యాప్తంగా సమాచారం అందిన వెంటనే అక్కడికి వెళ్లి కోళ్లకు చికిత్స అందించనున్నారు.

లక్షణాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

జిల్లాలో ఇప్పటివరకు పాజిటివ్ కేసులు నమోదు లేదు. కోళ్లలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించినా, కోళ్లు చనిపోతున్నా వెంటనే సమీపంలోని పశువైద్యాధికారికి సమాచారం అందించాలి. చనిపోయిన కోళ్లను జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు తీసుకువచ్చి పరీక్ష చేయించాలి. వైద్యులు సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చనిపోయిన కోళ్లను ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దు. గుంతలు తీసి అందులో సున్నం, ఉప్పు పోసి పూడ్చివేయాలి. పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ఖాద్రీ, డీవీఏహెచ్‌ఓ

ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ పాజిటివ్ కేసులు నమోదవుతున్నందున అక్కడి నుంచి బ్రాయిలర్, నాటు కోళ్లు నల్లగొండ జిల్లాకు రాకుండా నిరోధించేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గుంటూరు– నల్లగొండ జిల్లా సరిహద్దు అయిన వాడపల్లి, కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద, నాగార్జున సాగర్‌లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీస్, పశువైద్య సంవర్ధక శాఖ అధికారులు నిఘా ఉంచారు. కోళ్లను సరఫరా చేసే వాహనాలను ప్రత్యేకంగా పరిశీలించిన తరువాతే రాష్ట్ర సరిహద్దు దాటేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఆయా శాఖలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాయి.

టీచర్ ఎమ్మెల్సీ పోటీలో కోటీశ్వరులు



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్, అధికారులు

- అందరిలో ఆస్తిపరుడు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి
- నామినేషన్ వేసిన వారిలో ఆయనకే అత్యధిక ఆస్తులు
- రూ.17.30 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి
- ఆ తరువాత అత్యధికంగా సుందర్‌రాజుకు రూ.16.44 కోట్ల విలువైన ఆస్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో పలువురు కోటీశ్వరులు ఉన్నారు. ప్రధాన సంఘాలు, సంస్థలకు చెందిన వారిలో ఎక్కువ మందికి రూ.కోట్లలో ఆస్తులు ఉన్నాయి. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్లు, బంగారం, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా వివిధ రూపాల్లో ఉన్న తమ ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. వారికి బ్యాంకు, వ్యక్తిగత రుణాలు, ఇంటి రుణాలు కలుపుకొని పెద్దమొత్తంలో అప్పులు కూడా ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అందరికంటే ఆస్తిపరుడు. ఆయన ఇచ్చిన అఫిడవిట్ ప్రకారం రూ.17.30 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, రెండో స్థానంలో ప్రైవేటు విద్యా సంస్థ యజమాని సుందర్‌రాజు ఉన్నారు. ప్రధాన సంఘాల అభ్యర్థుల్లో టీచర్స్ జేఏసీ తరపున పోటీచేస్తున్న, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మాత్రం రూ.లక్షల్లోనే ఆస్తులు ఉండగా, అప్పులు కూడా ఉన్నాయి.

పలువురు అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులు, అప్పుల వివరాలివీ..

- స్వతంత్ర అభ్యర్థి కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఆయన భార్య పేరున ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం మొత్తంగా రూ.17.30 కోట్ల విలువైన భూములు, ఇళ్లు, బంగారం తదితర స్థిర, చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. వివిధ బ్యాంకులు, వ్యక్తిగత అప్పులు మొత్తంగా రూ. 3.27 కోట్ల అప్పులు ఉన్నాయి. ఆయన పేరుపై వాహనాలు ఏమీ లేవు.
- ప్రైవేటు విద్యా సంస్థల యజమాని ఎస్.సుందర్ రాజు, ఆయన భార్య, పిల్లల పేరున మొత్తంగా రూ.16.44 కోట్ల ఆస్తులు ఉండగా, బ్యాంకులు, ఇతరత్రా రూ.2.30 కోట్ల అప్పులు ఉన్నాయి. ఆస్తుల్లో ఆయన, ఆయన కుటుంబ సభ్యుల పేరున రూ. కోటి విలువైన 33 ఎకరాల భూమి ఉంది. ఆయన పేరున మోటారు సైకిల్ మాత్రమే ఉంది.
- ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఆయన భార్య పేరున మొత్తంగా ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.5.05 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, రూ.2.99 లక్షల అప్పు ఉంది. ఆస్తుల్లో రూ.90.10 లక్షల విలువైన బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎల్ఐసీలు, బంగారం ఉంది. మాడుగులపల్లి మండలం భీమనపల్లిలో ప్రస్తుతం రూ.1.20 కోట్ల విలువైన 4.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మిర్యాలగూడలో ప్లాట్లు ఉన్నాయి.
- డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, ఆయన భార్య పేరున అన్నీ కలిపి రూ. 3.20 కోట్ల ఆస్తులు ఉండగా, రూ.కోటిన్నర అప్పు ఉంది.
- ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య, ఆయన భార్య పేరున రూ. 3.06 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి.
- పీఆర్‌టీయూ(టీఎస్) అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి, ఆయన భార్య, పిల్లల పేరున మొత్తంగా రూ.2.29 కోట్లు విలువైన ఆస్తులు ఉండగా, ఇక రూ.1.36 కోట్ల అప్పులు ఉన్నాయి.
- బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి పేరున రూ.1.32 కోట్ల ఆస్తులు ఉండగా, రూ. 21.80 లక్షల అప్పులు ఉన్నాయి. ఆయన పేరున ఎలాంటి వాహనాలూ లేవు.
- స్వతంత్ర అభ్యర్థి పూల రవీందర్, ఆయన భార్య పేరున రూ.1.28 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, అందులో రూ.98 లక్షల విలువైన 21 ఎకరాల భూమి ఉంది. ఆయన పేరున మోటారు సైకిల్ మాత్రమే ఉంది.
- టీచర్స్ జేఏసీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఆయన భార్య, పిల్లల పేరున రూ.77 లక్షల ఆస్తులు ఉండగా, రూ. 57 లక్షల అప్పులు ఉన్నాయి.
- ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యుల పేరున రూ. 1.88 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, రూ.28 లక్షల అప్పులు ఉన్నాయి.
- స్వతంత్ర అభ్యర్థి బంక రాజు పేరున రూ.1.10 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, రూ. 13.74 లక్షల అప్పులు ఉన్నాయి.
- స్వతంత్ర అభ్యర్థి అర్వ స్వాతి, కుటుంబ సభ్యుల పేరున రూ.1.29 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా, రూ.40 లక్షల అప్పులు ఉన్నాయి.
- స్వతంత్ర అభ్యర్థి.. కంటె సాయన్న, ఆయన కుటుంబ సభ్యుల పేరున రూ. 3 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి.

నీలగిరిలో జోన్ల విభజన

- మున్సిపాలిటీలో ఏది ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ప్రణాళిక సిద్ధం

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలో రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్‌లో అభివృద్ధి పనులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, శ్మశానవాటికలు, గ్రీన్ జోన్ తదితర వాటిని జోన్‌ల వారీగా విభజించారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ పడితే అక్కడ, ఏది పడితే అది నెలకొల్పకుండా ప్రణాళిక ప్రకారం ఆయా జోన్‌లను ఏర్పాటు చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో రెసిడెన్షియల్ కాలనీలు ఏర్పాటు చేయకుండా నిషేధించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం అనుమతి, నిషేధం అనే అంశాలను పక్కాగా అమలు చేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీలో ఏది ఎక్కడ ఏర్పాటు చేయాలనేది మాస్టర్‌ప్లాన్‌లో స్పష్టంగా పొందుపర్చారు.

- నీలగిరి మున్సిపాలిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉన్న చోట పరిశ్రమలు, ఫ్యాక్టరీలకు అనుమతి ఇవ్వకూడదు.
- అక్వేరియం, మ్యూజియం, ఆశ్రమం, బస్‌బే, స్థానిక బస్టాండ్లు, బస్ టెర్మినల్ డిపోలు ఉన్న ప్రాంతాల్లో ఆటోమొబైల్ షోరూంలు, సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్ థియేటర్లు, కోల్డ్ స్టోరేజీలు, ధర్మశాల, అతిథి గృహాలు, లాడ్జింగ్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించరాదని పేర్కొన్నారు.
- చిల్డ్రన్ పార్కులు, కల్చరల్ ఆడిటోరియాలు, సబ్‌స్టేషన్లు, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లు, హార్టికల్చర్, గ్రీన్ హౌజ్‌లు, ప్లే గ్రౌండ్‌లు, పోలీస్ స్టేషన్లు, రీజనల్ పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, జువాలజికల్, బొటానికల్ గార్డెన్‌లు ఫైర్ స్టేషన్లు, టాక్సీ, ఆటో రిక్షా ప్రదేశాల్లో ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, ఐటీ పార్కులు, జైలు, వేర్ హౌజెస్, మాల్స్, నర్సరీ, ప్రైమరీ, ప్రీప్రైమరీ పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో పెట్రోలు బంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, రిటైల్ షాపులు, డిస్ట్రిబ్యూషన్ ఎల్‌పీజీ గోదాములు, కాలేజీలు, యూనివర్సిటీలు, స్టాఫ్ క్వార్టర్స్, సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డిస్పోజల్ ప్లాంట్లు, టౌన్‌షిప్, ట్రక్కు పార్కింగ్, వెటర్నరీ ఆస్పత్రులు, హోల్‌సేల్ మార్కెట్‌లు లాంటివి పెట్టకూడదని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు. అదేవిధంగా కమర్షియల్, నాన్ కమర్షియల్, మిక్సుడ్ కమర్షియల్ తదితర వాటిని కూడా పొందుపరిచారు.

ఒక నామినేషన్ తిరస్కరణ

- సంతకం లేకపోవడంతో తిరస్కరణకు గురైన స్వతంత్ర అభ్యర్థి ఉపేందర్ నామినేషన్

నల్లగొండ: కలెక్టరేట్‌లో మంగళవారం వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి నామినేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మాట్లాడుతూ.. నామినేషన్ల సమయం ముగిసిన తర్వాత మొత్తం 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి తుండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు చెప్పారు. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 22 మంది అభ్యర్థులు నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపట్టాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్

నల్లగొండ: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వరంగల్– ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో పాల్గొన్న అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టే ఆర్జాలబావి వద్ద ఉన్న గోదాంను తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎస్పీని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ అశోక్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.



ఆర్జాలబావి వద్ద ఉన్న గోదాంను తనిఖీ చేసి సూచనలు చేస్తున్న అహ్మద్ నదీమ్

ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర



రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి



చండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: పంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు స్టేజీ– 1, 2 అధికారులది కీలకపాత్ర అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల స్టేజ్ 1, 2 రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై పలు సూచనలు చేశారు. జెడ్పీసీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల విషయమై 66 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేస్తాం

చండూరు: చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీ పోస్టులను ఎన్నికల కోడ్ అనంతరం భర్తీ చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం బోడంగిపర్తిలో గల గురుకుల పాఠశాల, చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీఓ శ్రీదేవి, కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ దశరథ, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుదారుల్లో అయోమయం

- ప్రజాపాలనలో ఇప్పటికే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ
- తాజాగా మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటన
- గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా మరోసారి చేసుకోవాలా అని సందిగ్ధం
- స్పష్టత ఇవ్వాలని కోరుతున్న దరఖాస్తుదారులు

నల్లగొండ టూటౌన్: గత ప్రభుత్వంలో నూతన రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కూడా చేపట్టారు. అయితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుదారులందరూ మరోసారి మీసేవా కేంద్రాల్లో చేసుకోవాలా అనే సందేహంలో ఉన్నారు. పలువురు మీసేవా కేంద్రాల వద్దకు వెళ్లి వివరాలు అడిగే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో మీ సేవా కేంద్రం నిర్వాహకులు తమకు ఎలాంటి సమాచారం తెలియదని, రేషన్ కార్డుల కోసం మాత్రం ఇక్కడ దరఖాస్తు చేసుకోవచ్చని చెబుతున్నారు. దీంతో చాలా మంది దరఖాస్తులు చేసుకోవాలా, వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.



ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యం (ఫైల్)

ప్రజాపాలనలో 9వేలకు పైగా దరఖాస్తులు

నీలగిరి పట్టణంలో ఇటీవల గ్రామ సభలు పెట్టి ప్రజాపాలనలో దాదాపు 9 వేలకు పైగా దరఖాస్తులు స్వీకరించారు. వారిలో చాలా మంది కొత్త రేషన్ కార్డుల కోసమే దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నారు. కానీ ప్రభుత్వం కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ప్రజాపాలన దరఖాస్తులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఓ ప్రొఫార్మా ప్రకారం కంప్యూటర్‌లో రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. దరఖాస్తుదారులు అయోమయానికి గురికాకుండా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తు చేయని వారే చేసుకోవాలి



కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ మీసేవా కేంద్రాల్లో చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రజాపాలన దరఖాస్తులను కలెక్టరేట్ నుంచి వచ్చిన ప్రొఫార్మా ప్రకారం ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. కొత్త వారు, ఇంతకు ముందు దరఖాస్తు చేయని వారు మాత్రమే చేసుకోవాలి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

క్లుప్తంగా

మేకల అపహరణ

కనగల్: నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి 13 మేకలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. జి. చెన్నారం గ్రామానికి చెందిన ఉప్పనూతల వెంకన్నకు చెందిన 10 మేకలు, కట్ట అంజయ్యకు చెందిన 3 మేకలను దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం కనగల్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. దొంగలు ఎత్తుకెళ్లిన మేకల విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

ప్రాణం తీసిన విద్యుత్ తీగలు

- పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు తగిలి వలస కూలీ మృతి

చందంపేట: అడవి పందుల నుంచి పంట పొలాలను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వలస కూలీ మృతిచెందాడు. ఈ ఘటన నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీ సమీపంలోని పెద్దమునిగల్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ప్రాంతానికి చెందిన వెంకటేష్(42)ను వైజాక్ కాలనీకి చెందిన రాకాటి శివ చేపల వేటలో సహాయం కోసం ఇక్కడకు తీసుకొచ్చాడు. పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ చెన్నా తన వ్యవసాయ పొలాన్ని రక్షించుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన వెంకటేష్ విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేతావత్ చెన్నాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి

హుజూర్‌నగర్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి హుజూర్‌నగర్‌లో జరిగింది. మంగళవారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గంజి శివ సోమవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. స్థానిక శాంతి స్తూపం వద్దకు రాగానే హుజూర్‌నగర్ పట్టణానికే చెందిన కస్తాల యాకూబ్, మరో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కలిసి శివను అడ్డగించి కిందపడేసి కొట్టారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

భువనగిరిటౌన్: భువనగిరి మున్సిపాలిటీకి చెందిన మహిళ మంగళవారం రాయిగిరికి వెళ్లేందుకు యాదగిరిగుట్ట భువనగిరి బస్టాండ్‌లో వేచి చూస్తుండగా.. ఆమె బ్యాగులో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

- గరుడ వాహనం, దివ్య విమాన రథంపై ఊరేగిన పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి
- నేడు చక్రతీర్థం



గరుడ వాహనంపై ఆసీనులైన స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు, కలెక్టర్, ఈఓ తదితరులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగగా.. రాత్రి దివ్య విమాన రథంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిత్యారాధనల అనంతరం పారాయణీకులచే చతుర్వేద పారాయణములు, నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపములు, లక్ష్మీ అష్టోత్తరనామ జపములు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుఢ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం రథాంగహోమం, రథబలి వేడుకలను నిర్వహించారు. దివ్య విమాన రథంపై స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం ముందుకు సాగింది. రథోత్సవంలో యువత, మహిళలు, భక్తులు అధికంగా పాల్గొన్నారు. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. ఆయా వేడుకల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చక బృందం పాల్గొన్నారు.

నేడు చక్ర తీర్థం..

బుధవారం ఆలయంలో ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 5 గంటలకు దేవతోద్వాసన, శ్రీపుష్ప యాగం వంటి పూజలు నిర్వహిస్తారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మల్లాపురానికి చెందిన శ్రీరామ భక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళా భజన మండలి, జై శ్రీరామ భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా యాదగిరిగుట్టలోని హరీష్ డ్యాన్స్ అకాడమీ, సహస్ర, ఏలూరి యామిని కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన సాంస్కృతిక విశ్వ కళా మండలి రాంపల్లి నర్సయ్య బృందంచే కూచిపూడి నృత్యం, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన గడ్డం సుదర్శన్ బృందంచే చిందు యక్ష గానం ప్రదర్శించారు.



కూచిపూడి కళాకారులతో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి తదితరులు

పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- వధువు తరఫు బంధువు మృతి, సోదరుడి పరిస్థితి విషమం



ఘటనా స్థలంలో పడిపోయిన బైక్

యాదగిరిగుట్ట రూరల్: పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వధువు సోదరుడు, వారి బంధువు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు బంధువు మృతిచెందగా, సోదరుడికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన ఎండీ ఇబ్రహీం సోహెల్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సోహెల్ అక్కకు హన్మకొండకు చెందిన వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. సోహెల్ తండ్రి గతంలోనే మృతిచెందగా.. అక్క పెళ్లి దగ్గరుండి చేయాలని పదిహేను రోజుల క్రితం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ నెల 21వ తేదీన పెళ్లి ముహూర్తం పెట్టుకుని పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు గాను మంగళవారం తెల్లవారుజామున వరుడు ఇంటికి తన సమీప బంధువు ఎండీ అస్లాంతో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై సోహెల్ హన్మకొండకు బయల్దేరాడు. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామపరిధిలోని హరిత వెంచర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనక కూర్చున్న ఎండీ అస్లాం(27) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న ఎండీ సోహెల్‌కి తీవ్ర గాయాలై రక్తం స్రావం అవుతుండగా స్థానికులు 108 వాహనంలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నల్లగొండ: ప్రభుత్వ అధికారులపై తప్పుడు వార్తలు రాస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. ఈ కేసు వివరాలను మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. నాగుల ఆనంద్‌కుమార్ అనే వ్యక్తి క్రైం మిర్రర్ పేరిట డిజిటల్ పేపర్ పెట్టి తనకు పరిచయం ఉన్న తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు సహకారంతో నల్ల గొండ జిల్లాతో పాటు వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ తదితర జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులపై తప్పుడు వార్తలు రాసి అక్రమ వసూళ్లకు పాల్పడేవాడు. మిర్యాలగూడ సీఐ వీరబాబు ఫిర్యాదుతో నాగుల ఆనంద్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రాజశేఖరాజు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో నల్లగొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తనకు జరిగిన అన్యాయం గురించి కొంపల్లి మత్స్యగిరి నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నల్ల గొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆనంద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఇలాంటి ఘటనలు మరికొన్ని వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ రాజశేఖరరాజు వివరించారు. నిందితులకు ఒక సీఐ, కానిస్టేబుల్ సహకరిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

చెట్టుకు ఢీకొన్న ఆటో.. వృద్ధురాలు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



వర్రె మల్లమ్మ (ఫైల్)

ఆత్మకూర్(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం ఏనుబాముల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏనుబాముల గ్రామానికి చెందిన వర్రె మల్లమ్మ, వర్రె పార్వతమ్మ సూర్యాపేట మండలం ఆరెగూడెంలో తమ బంధువుల దశదినకర్మకు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు గాను సూర్యాపేటలో నెమ్మికల్‌కు చెందిన మోరపాక వెంకన్న ఆటో ఎక్కారు. ఆటో ఏనుబాముల గ్రామ స్టేజీ సమీపంలోని సంతోషిమాత ఆలయం వద్దకు రాగానే అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వర్రె మల్లమ్మ(70) అక్కడికక్కడే మృతిచెందగా.. వర్రె పార్వతమ్మ, ఆటో డ్రైవర్ మోరపాక వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం, మల్ల మ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలి కుమారుడు వర్రె రామన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అద్దె ఇంట్లో అంతిమ సంస్కారాలకు నిరాకరణ

- ఖాళీ స్థలంలో టెంటు వేసి కడసారి కార్యక్రమాల నిర్వహణ



జెట్ల రాము (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వ్యక్తి అంతిమ సంస్కారలు నిర్వహించేందుకు అద్దె ఇంటి యజమాని ఒప్పుకోలేదు. దీంతో మృతుడికి చెందిన ఖాళీ ప్లాటులో టెంట్ వేసి కుటుంబ సభ్యులు, బంధువులు అంతిమ కార్యక్రమాలు పూర్తిచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కార్మికుడు జెట్ల రాము(38), అతడి స్నేహితుడు బల్ల దేవేందర్ ఈ నెల 9న స్కూటీపై జలాల్‌పురం నుంచి పోచంపల్లి వైపు వెళ్తుండగా జరిగిన అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వారిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున రాము మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం రాము మృతదేహాన్ని మంగళవారం రాత్రి పోచంపల్లికి తీసుకొచ్చారు. జెట్ల రాము అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని.. ఆ ఇంట్లో అంతిమ సంస్కారాలు చేయడానికి నిరాకరించాడు. దీంతో వెంకటరమణ కాలనీలో రాముకు ఉన్న ప్లాటులో కుటుంబ సభ్యులు, టెంట్ వేసి అంత్యక్రియలు నిర్వహించారు. దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయ్యే వరకు జెట్ల రాము కుటుంబ సభ్యులకు పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉండేందుకు తాత్కాలిక ఆవాసాన్ని కాలనీవాసులు కల్పించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.16,45,100



హుండీలోని నగదు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. 11 రోజుల్లో రూ.16,45,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

రామన్నపేట : రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం శివారులోని విద్య ఆగ్రో రైస్ మిల్లులో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రికార్డులను, ధాన్యం నిల్వలను పరిశీలించారు. బుధవారం కూడా తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ గౌస్, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, ఏఎస్‌ఓ రోజారాణి, డీటీ బాలమణి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

చిట్యాల: సరదాగా కాల్వలో ఈతకు వెళ్లిన యువకుడు అందులో మునిగి మృతిచెందాడు. చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన ఖమ్మంపాటి సైదులు కుమారుడు అరవింద్(20) తన అమ్మమ్మ ఊరైన మునుగోడు మండలం గూడపూర్ గ్రామానికి వెళ్లాడు. మంగళవారం గ్రామ సమీపంలో నల్లగొండ మండలం నర్సింగ్‌బట్ల గ్రామ పరిధిలోని ఎస్‌ఎల్‌బీసీ కాల్వ వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అరవింద్ ప్రమాదవశాత్తు కాల్వలో మునిగి మృతిచెందాడు. స్థానికులు అరవింద్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం నేరడ తీసుకొచ్చారు. చేతికందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో అరవింద్ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

యువతిపై పెట్రోల్ చల్లిన యువకుడిపై కేసు నమోదు

హుజూర్‌నగర్: తనను ప్రేమించడం లేదని యువతితో గొడవపడి ఆమెపై పెట్రోల్ చల్లిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో జరిగింది. మంగళవారం ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మోటమర్రి గ్రామానికి చెందిన యువతి మూడు నెలల నుంచి హుజూర్‌నగర్ పట్టణంలోని తన మేనమామ ఇంటి వద్ద ఉంటోంది. స్థానికంగా కోదాడ రోడ్డులో గల ప్రైవేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోంది. సదరు యువతికి మోటమర్రి గ్రామానికే చెందిన సుందర్ ప్రమోద్‌కుమార్‌తో పరిచయం ఉంది. సోమవారం ప్రమోద్‌కుమార్ యువతికి ఫోన్ చేసి మాట్లాడాలి బటయకు రమ్మని కోరగా.. ఆమె బయటకు వచ్చింది. ఈ క్రమంలో తనను ఎందుకు ప్రేమించడం లేదని ఆమెతో యువకుడు గొడవపడ్డాడు. తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను యువతిపై చల్లాడు. దీంతో సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

- తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు



నేరేడుచర్ల మండలం సోమారం గ్రామంలో పూడ్చిన శవానికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేరేడుచర్ల: తల్లి మృతిపై కుమారుడు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పూడ్చిన ఆమె మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన పెద్దపంగు అమృతం, ఆయన భార్య కనకమ్మ మేళ్లచెరువు మండలం మైహోం సిమెంట్ కర్మాగారం క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. అమృతం మైహోం సిమెంట్ కర్మాగారంలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా.. కనకమ్మ కోదాడ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. జనవరి 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కనకమ్మ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సోమారం గ్రామంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కనకమ్మ మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే కనకమ్మ పెద్ద కుమారుడు సందీప్‌కుమార్ తన తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 10వ తేదీన ఫిర్యాదు చేశాడు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, మేళ్లచెరువు ఇన్‌చార్జి ఎస్ అంతిరెడ్డి, మేళ్లచెరువు మండల తహసీల్దార్ జ్యోతి సమక్షంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి సిబ్బందితో కలిసి మంగళవారం సోమారం గ్రామంలో కనకమ్మ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు.

స్థానిక సంస్థల పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వతరెడ్డి భవన్‌లో నిర్వహించిన సీపీఐ నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసి గెలిచేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, ఎండీ మైనోద్దీన్, వెంకటయ్య, జయరాములు, అచ్చయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా టీచర్ దుర్మరణం



ఎండీ జబీన్ (ఫైల్)

అడ్డగూడూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళా టీచర్ మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామ శివారులో జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం దాచారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న ఎండీ జబీన్(54) అడ్డగూడూరు మండల కేంద్రంలోని మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి స్కూటీపై వస్తుండగా.. చౌల్లరామారం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కుక్కల దాడిలో 9 గొర్రెలు మృతి

మోటకొండూర్ : కుక్కల దాడిలో 9 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన తొట్టె మల్లయ్య సోమవారం గొర్రెలను మేపి సాయంత్రం కర్నాల బావి వద్ద తన దొడ్డిలోకి తోలి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. మంగళవారం ఉదయం గొర్రెల దొడ్డి వద్దకు వెళ్లిన మల్లయ్యకు 5 గొర్రెలు, 4 గొర్రె పిల్లలు మృతిచెంది కనిపించాయి. మరో 7 గొర్రెలకు గాయాలైనట్లు గుర్తించాడు. చనిపోయిన గొర్రెల విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణంలో గతేడాది అక్టోబర్‌లో కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన కొప్పు నగేష్ బైక్ చోరీ చేశాడు. బైక్ యజమాని సన్నగళ్ల మల్లేష్ కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కొప్పు నగేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం దేవరకొండ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్.హరీష్‌బాబు నగేష్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువులు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి: వ్యవసాయ బావుల వద్ద కట్టేసిన పశువులను చోరీ చేస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను కొండమల్లేపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య తన రెండు ఆవులను వ్యవసాయ బావి వద్ద కొట్టంలో కట్టేయగా.. గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఆవులను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కొండమల్లేపల్లి చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. పశువులను చోరీ చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నాడు. వారి నుంచి రెండు ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు డిండి, దేవరకొండ, యాచారం ప్రాంతాల్లో కూడా పశువులను దొంగలించినట్లు ఒప్పుకున్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

చకచకా పెద్దగట్టు పనులు



కోనేరును శుభ్రం చేసి రంగులు వేస్తున్న దృశ్యం



విజయవాడ-హైదరాబాద్ హైవే వెంట ఏర్పాటు చేసిన బారికేడ్లు



జాతరలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్

ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్న దురాజ్‌పల్లి లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు సంబంధించిన పనులు చకచకా నడుస్తున్నాయి. గుట్ట చుట్టూ కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. లైటింగ్, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం గుట్టపై చలువ పందిళ్లు వేస్తున్నారు. అదేవిధంగా గుడికి రంగులు వేసి విద్యుత్ లైట్లు అమర్చి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



గుట్టపై వేసిన చలువ పందిళ్లు



ఆర్చి వద్ద చదును చేస్తున్న దృశ్యం